ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్

బాన్సువాడ, ఫిబ్రవరి 20 : బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మున్సిపల్ కమిషనర్ ఎంఏ అలీం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిబ్బందితో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్ రెడ్డి, తుల శ్రీను, మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, కిరణ్ ఉన్నారు.

నూనె గింజల పరిశోధనా సంస్థ బోర్డు మెంబర్‌గా కొండెల సాయిరెడ్డి

సారంగాపూర్, ఫిబ్రవరి 20 : అఖిల భారత నూనె గింజల పరిశోధనా సంస్థ బోర్డు మెంబర్‌గా రాష్ట్రం తరపున ఇందూరు జిల్లావాసి, సాయి వెజిటేబుల్స్ అండ్ ఫ్రూట్స్ గ్రోయర్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండెల సాయిరెడ్డిని నియమిస్తూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఎఆర్) కార్యదర్శి యశోధా నాయల్ ఉత్తర్వులు జారీ చేశారు. పదవిలో ఆయన మూడేండ్లపాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ.. విదేశాల నుంచి నూనె దిగుమతులను తగ్గించి, స్థానికంగా నూనె గింజల ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. సాయి వెజిటెబుల్స్ అండ్ ఫ్రూట్ గ్రోయర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులను ప్రోత్సహించి కుసుమ, నువ్వుల పంటలను సాగు చేసేందుకు విత్తనాలను కూడా సరఫరా చేశామని గుర్తుచేశారు.

ప్రతిభను వెలికి తీయడానికే టాలెంట్ టెస్టులు

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టును ఫిజికల్, బయోసైన్స్ ఫోకస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి టాలెంట్ టెస్టులు ఉపయోగపడుతాయని అన్నారు. అనంతరం విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, కళాశాల సీఈవో హరిస్మరణ్‌రెడ్డి, ఎఫ్‌పీఎస్‌టీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఫిజికల్ సైన్స్ బయోసైన్స్ ఫోరం బాధ్యుడు సురేశ్, కృష్ణకాంత్, ప్రవీణ్, రమేశ్, సంతోష్ కుమార్, ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

మాచారెడ్డి, ఫిబ్రవరి 20 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్ రోడ్ గ్రామంలో ఏఐసీటీ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి కుట్టు శిక్షణ ఇచ్చారు. వారికి మంగళవారం మాజీ సర్పంచ్ హంజీనాయక్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోకల కిషన్, అబ్దుల్‌ఖాన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

చెన్నాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యసాయాధికారిణి భాగ్యలక్ష్మి

అచ్చంపేటలో ఈ కేవైసీ నమోదు చేస్తున్న ఏఈవో స్వర్ణలత

■ జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

గాంధారి, ఫిబ్రవరి 20: రైతులు ఈ-కేవైసీని నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చెన్నాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధిపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఈ-కేవైసీ నమోదు చేయించుకోవడం ద్వారా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని అన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వారి సూచనల మేరకే ఎరువులు, పురుగుల మందులను పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం పోతంగల్ కలాన్‌లోని ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఆమె వెంట ఏవో నరేశ్, ఏఈవోలు జ్యోత్స్న, షోయబ్ అహ్మద్, విఘ్నేశ్ తదితరులు ఉన్నారు.

ఈ-కేవైసీపై అవగాహన

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: మండలంలోని అచ్చంపేట, వొడ్డేపల్లి గ్రామాల్లో రైతులకు ఏఈవోలు స్వర్ణలత, రేణుక ఈ-కేవైసీ పై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో వారు ఇంటింటికీ తిరుగుతూ రైతుల ఈ-కేవైసీ నమోదు చేయించారు. మండలంలో ఇంకా ఐదు శాతం రైతులు ఈ-కేవైసీ నమోదు చేయించుకోలేదని, వారందరూ తప్పకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు.

వ్యవసాయాధికారుల సూచనల మేరకే మందులను పిచికారీ చేయాలి

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 20 : పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతున్న తరుణంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకే మందులను పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని తాడ్కోల్ గ్రామ శివారులో రైతులు సాగు చేస్తున్న పంటలను ఏఈవో గోపాల్, రైతులతో కలిసి పరిశీలించారు. క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగిన సలహాలు అందించాలని అన్నారు. ఆమె వెంట ఏఈవో గోపాల్, రైతులు ఉన్నారు.

వరి పంట పరిశీలన

బీబీపేట్, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంతోపాటు ఇస్సాన గర్‌లో సాగుచేస్తున్న వరి పంటను ఏఈవో రాఘవేంద్ర మంగళవారం పరిశీలించారు. పంటలో కాండం తొలచు పురుగును గుర్తించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి

మాచారెడ్డిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ

మాచారెడ్డి, ఫిబ్రవరి 20 : విద్యార్థులు కష్టపడి చదివి తమకు నచ్చిన రంగాల్లో ఉన్నత లక్ష్యానికి చేరుకోవాలని ఎంపీపీ నర్సింగ్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు, స్పోర్ట్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ఆవరణలో షెడ్డు నిర్మాణానికి రూ.లక్షా 30 వేలు అందజేశారు. వివిధ కీడాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, సీడీసీ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ నాయకులు రావుల ప్రభాకర్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సంబరాలు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 20 : బీర్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం వీడ్కోలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యకర మంలో ఎంపీపీ రఘు, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ సభ్యుడు సందీప్, నాయకులు గంగారాం, మన్నాన్ పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

■ డీసీసీబీ వార్షిక మహాజన సభలో చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

ఖిలీల్‌వాడి, ఫిబ్రవరి 20: నిజామాబాద్‌లోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో వార్షిక మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ప్రకటించిన ఓటీఎస్‌ను మార్చి 31 వరకు పొడిగించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాత బకాయిలను చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. అసైన్డ్ భూములకు మంజూరుచేసే పంట రుణాల పరిమితిని పెంచాలని సభ్యులు కోరగా, టీఎస్‌క్యాప్ పాలకవర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. మహాజన సభలో వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, పాలకవర్గ సభ్యులు, బ్యాంకు సీఈవో, సొసైటీ చైర్మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌ను కలిసిన నాయకులు

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : జిల్లా ఏరియా దవాఖాన నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాంసింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, సంజీవరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కామారెడ్డి డీఎస్పీగా నాగేశ్వర్ రావు

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : కామారెడ్డి డివిజనల్ పోలీస్ అధికారిగా నాగేశ్వర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు మందు ఇక్కడ పని చేసిన ప్రకాశ్ మంచిర్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సౌత్ జోన్‌లో పనిచేసిన నాగేశ్వర్ రావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : కామారెడ్డి జిల్లా ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3,816 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న డీఎల్, జేఎల్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కొద్ది సేపు పోలీసులతో వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, జిల్లా కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూషరెడ్డి, ఖలీల్, రోహిత్, సంజయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి యువకుడి మృతి

బాన్సువాడ, ఫిబ్రవరి 20 : బాన్సువాడలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని జగదాంబ తండాకు చెందిన మెగావత్ సుమన్, ముస్తఫా బాన్సువాడకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. బస్టాండ్ నుంచి తాడ్కోల్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్న యువకులు పక్కనుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించారు. వాహనాన్ని నడుపుతున్న ముస్తఫా డివైడర్‌ను ఢీకొట్టడంతో సుమన్ బస్సు వెనుక చక్రాల కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో దవాఖాకు తరలించగా సుమన్ మృతి చెందాడు. ముస్తఫాకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి మెగావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

దోమకొండ/బాన్సువాడ, ఫిబ్రవరి 20 : దోమకొండలో నల్ల మారెమ్మ దేవి, ముత్యాలమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు మండల నాయకులు, ప్రముఖులు, హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాన్సువాడలోని సంగమేశ్వర కాలనీలో నూతనంగా నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహించారు.

అవిశ్వాస తీర్మానంపై కోర్టు స్టే

స్టే కాపీని అందజేస్తున్న నాయకులు

రామారెడ్డి, ఫిబ్రవరి 20: రామారెడ్డి ఎంపీపీ, వైస్ ఎంపీపీపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కోర్టు స్టే విధించింది. ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్‌రావుపై ఈనెల 9వ తేదీన ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మాన కాపీని అందజేశారు. దీనిపై వారు కోర్టుకు వెళ్లడంతో స్టే విధించింది. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీని రామారెడ్డి ఆర్డీవో రంగనాథరావుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకుడు లింబాద్రి నాయక్ తదితరులు ఉన్నారు.

అద్దె డబ్బులు పెంచాలని వినతి

పిట్లం, ఫిబ్రవరి 20: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల వసతి గృహం భవన యజమానులు అద్దె డబ్బులు పెంచాలని కోరుతూ ప్రిన్సిపాల్ గులాం రబ్బానీకి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యజమానులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండు సంవత్సరాలు మాత్రమే అగ్రిమెంట్ రాసి ఇచ్చిందన్నారు. ఇప్పటికీ నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా అద్దె పెంచలేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అద్దె డబ్బులు పెంచేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో భవన యజమానులు ఉడుగుల శ్రీకాంత్, బుక్క లింగం, కర్రె భాస్కర్, పడిగెల శ్రీనివాస్ ఉన్నారు.

చుక్కాపూర్‌లో సాహిత్యంపై అవగాహన

మాచారెడ్డి, ఫిబ్రవరి 20 : మండలంలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో బాలసాహితివేత్త డాక్టర్ వీఆర్‌శర్మ ఆధ్వర్యంలో సాహిత్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిల్లలందరికీ స్వేచ్ఛనిస్తే మంచి కథలు చెప్పగలరు, రాయగలరని అన్నారు. విద్యార్థులు తెలుగు భాషపై ప్రేమతో ఉండి పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాన్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డ్రైవర్స్ యూనియన్ బాధ్యులు

ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుతో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు

మద్నూర్, ఫిబ్రవరి 20: జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావును మండలకేంద్రానికి చెందిన డ్రైవర్స్ యూనియన్ బాధ్యులు మంగళవారం కలిశారు. జుక్కల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి యూనియన్ కార్యాలయం ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. యూనియన్ అధ్యక్షుడు మగ్ధూమ్, ఉపాధ్యక్షుడు దేవీదాస్, సభ్యులు నగేశ్, చందు, హైమద్‌తోపాటు నాయకులు హన్మాండ్లు స్వామి, వట్నాల రమేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు సమస్యలు వివరిస్తున్న వెల్లుట్లపేట గ్రామ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని వెల్లుట్లపేట గ్రామ నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ఎల్లారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిశారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు గణపతి, అంజయ్య తదితరులు ఉన్నారు.

వీవోఏలకు ముగిసిన రెండు రోజుల శిక్షణ

నిజాంసాగర్, ఫిబ్రవరి20: నిజాంసాగర్‌లోని స్త్రీ శక్తి భవనంలో నిజాంసాగర్, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన వీవోఏలకు లఖ్‌పతి దీదీపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో డీపీఎం వకుల, నిజాంసాగర్ ఏపీఎంలు రాంనారాయణగౌడ్, రాజేందర్, ప్రసన్నరాణి పలు అంశాలపై వీవోఏలకు వివరించారు. సంఘాల్లో ఉన్న సభ్యులకు రుణాలు అందించడం, రికవరీ చేయడం, ఖాతాల నిర్వహణతోపాటు ప్రతి నెలా సమావేశాలను ఏర్పాటు చేయడంపై అవగాహన కల్పించారు. సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, రుణాలను సభ్యులు ఏ విధంగా రెట్టింపు చేసుకోవాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన సీసీలు, వీవోఏలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నేరాల అదుపులో విద్యార్థులది కీలక పాత్ర

షీ టీంపై విద్యార్థినులకు అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యుడు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 20: బాలికలు, మహిళలపై జరుగుతున్న నేరాల అదుపులో విద్యార్థులది కీలక పాత్ర అని షీ టీం సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డి జడ్పీహెచ్‌ఎస్(బాలికల)లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో షీ టీం, సైబర్ క్రైం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. విద్యార్థినులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ను అతిగా వాడొద్దని, సోషల్‌మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలను షేర్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తమకు ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, అనుచితంగా మాట్లాడినా వెంటనే షీ టీం సభ్యులకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని విద్యార్థినులకు సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం మానవ అక్రమ రవాణా నిరోధక యూనిట్ సభ్యుడు రాజేందర్ పలు విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమావేశంలో షీ టీం సభ్యురాలు సుప్రజ, ఎంఈవో వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ షుగర్స్‌లో 25వరకు క్రషింగ్

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: మండలంలోని మాగి గాయత్రీ చక్కర పరిశ్రమలో చెరుకు గానుగను ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, కేన్ జనరల్ మేనేజర్ వెంగల్‌రెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న క్రషింగ్ నిలిపివేస్తున్నట్లు ముందుగా ప్రకటించిన విషయం విదితమే. రైతుల కోరిక మేరకు 25వ తేదీ వరకు పొడగించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 25వ తేదీ అనంతరం చెరుకు మిగిలితే అందుకు యాజమాన్యం బాధ్యత వహించదని స్పష్టం చేశారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

నిజాంసాగర్, ఫిబ్రవరి 20: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన నిఖిత(19) అదృశ్యమైనట్లు ఏఎస్సై రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించిన యువతి సోమవారం ఉదయం లేచి చూసే సరికి లేదని కుటుంబీకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి లింగమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ఘనంగా జూనియర్ కాలేజీ వార్షికోత్సవం

గాంధారి, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ గంగారాం మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత కొలువుల్లో స్థిరపడాలని సూచించారు. త్వరలో జరిగే వార్షిక పరీక్షలు అందరూ బాగా రాయాలని, మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కాలేజీ టాపర్‌గా నిలిచిన పూజ అనే విద్యార్థినికి నారాయణజెట్టి జ్ఞాపకార్థం రూ.3,001 నగదును అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌గోపాల్, లక్ష్మణ్, శ్రీధర్, విజయ్ కుమార్, రమేశ్, వెంకటస్వామి, సరిత, సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ప్రోత్సాహక బహుమతి

పిట్లం, ఫిబ్రవరి 20: మండలకేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా రైతు సంబరాలు నిర్వహించారు. మండలంలోని గ్రోమోర్ సెంటర్‌లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి నిర్వాహకుల సూచనలు పాటించి పలువురు రైతులు అధిక దిగుబడి సాధించారు. ఈ మేరకు రైతు సంబురాలు నిర్వహించగా.. చిల్లర్గి గ్రామానికి చెందిన బాలయ్య అనే రైతుకు 50గ్రాముల వెండిని ఏవో కిషన్ అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

పిట్లం, ఫిబ్రవరి 20: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న లైబ్రరీలకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో దేవీసింగ్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎంలు విఠల్, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, జ్యోతి, సీఆర్పీలు హైమద్‌పాషా పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకం పనులు ప్రారంభం

మాచారెడ్డి, ఫిబ్రవరి 20 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లోని వీరహనుమాన్ ఆలయ ఆవరణలో మంగళవారం బోరుబావి తవ్వకం పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం బాల వికాస్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు బన్సీలాల్, అలీఖాన్, రాజు, బ్రహ్మం, సత్యనారాయణ, సీతారాం, నరేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖాన సందర్శన

భిక్కనూరు, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను జిల్లా వైద్యాధికారిణి శోభారాణి మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అమ్మఒడికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు మండల వైద్యాధికారి యోమిమా తెలిపారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I'm SHAMAKURA SAYA REDDY, S/o. Chinnaiah, R/o. 5-31, Borgaon (P), Nizamabad Dist., TS., have Changed My Name as CHAMAKURA SAYA REDDY, S/o. Chinnaiah.
NT-311774

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లిఖిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

పెద్దకొడప్‌గల్ పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

పెద్దకొడప్‌గల్/ బిచ్కుంద, ఫిబ్రవరి 20: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. పెద్దకొడప్‌గల్, బిచ్కుంద పోలీస్‌స్టేషన్లను ఆయన మంగళవారం సందర్శించారు. స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు తదితర విషయాలను ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కరించాలన్నారు. అరెస్టులు, చార్జిషీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని సూచించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజ